## క్లుప్తంగా

### పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలకు ఎక్స్‌లెన్స్ అవార్డు



**వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):** నగరంలోని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు ఏపీ ఉన్నత విద్యామండలి 'ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్-2023' అవార్డును ప్రదానం చేసినట్లు ఆ కళాశాల కార్యదర్శి పడుచూరి లక్ష్మణస్వామి తెలిపారు. ఈ మేరకు నగరంలో ఏపీ ఉన్నత విద్యామండలి నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తమ కళాశాలకు ఈ అవార్డును అందించారన్నారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన చేస్తున్నందుకు యూజీసీ అనుబంధ సంస్థ నాక్ నుంచి ఏ డబుల్ ప్లస్‌ను సాధించిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలి ఈ అవార్డుకు తమను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ ఆచార్య కె.రామ్మోహనరావుల చేతుల మీదుగా ఈ అవార్డును తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారన్నారు.

### శారీరక ఆరోగ్యంతో మానసిక ప్రశాంతత

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** శారీరక ఆరోగ్యంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ వంశీలాల్, డాక్టర్ విజేత తెలిపారు. స్థానిక దుర్గాపురం ఎస్‌టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాలలో జార్జ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జార్జ్ ఇనిస్టిట్యూట్ సూపర్‌వైజర్ కమల మాట్లాడుతూ.. వారోత్సవాల్లో భాగంగా అడాల్సెంట్స్ రెసిలెన్స్ అండ్ ట్రీట్‌మెంట్ నీడ్స్ ఫర్ మెంటల్ హెల్త్ ఇన్ ఇండియన్ స్లమ్స్ ప్రోగ్రామ్ ద్వారా పలు పాఠశాలలు, స్లమ్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం భానునగర్, రాజీవ్‌నగర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల సిబ్బంది, జార్జ్ ఇనిస్టిట్యూట్ సిబ్బంది మలరాజు మహేష్, పరమేశ్వరరావు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

### జాతీయ సమైక్యతను చాటిన నృత్య ప్రదర్శనలు



**విజయవాడకల్చరల్:** భారతీయ కళావైభవం వెల్లువిరిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను కళాకారులు ప్రదర్శించి జాతీయ సమైక్యతను చాటారు. దసరా మహోత్సవాల నిర్వహణ కమిటీ, మాకినేని బసవ పున్నయ్యా విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో దసరా సాంస్కృతిక మహోత్సవాల సందర్భంగా బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞానకేంద్రంలో పలు రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. కూచిపూడి, భరతనాట్యం, రాజస్థానీ, దాండియా, పంజాబీ కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు పిళ్లా ఉమామహేశ్వర పాత్రుడు, సప్తా శివకుమార్, మాగలూరి త్రినాథాచారి, యండం నరేంద్రకుమార్, సట్టువేణుగోపాల్, నాట్యాచారిణులు యల్లా జోస్యుల అనూరాధ, జి.శైలజ, మల్లిశెట్టి అనూష నాయుడు తమ బృందాలతో నృత్యాలను ప్రదర్శించారు. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవా కార్యక్రమాలను ప్రారంభించారు. రెండు రోజులుగా సమర్థవంతంగా కార్యక్రమాలు నిర్వహించారని నిర్వాహకులను అభినందించారు. కమిటీ సభ్యులు కె.సరోజ, ఉషారాణి, కావూరి సత్యవతి, సంధ్యారాణి, ఎస్ విద్యాఖన్నా పాల్గొన్నారు.

### రెసిడెన్షియల్ యూనియన్లను అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలి

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లను భాగస్వామ్యం చేయాలని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ శిర్నామే, ఎం.దుర్గాప్రసాద్, కలిగినీడి రామారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఎవరి ప్రాంతం అభివృద్ధి ఆయా ప్రాంతాల యూనియన్లను అప్పగించటం ద్వారా నాణ్యమైన పనులు జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకు గానూ తాము రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రముఖ పార్టీ నేతలను కలిసి వినతి పత్రాలు అందజేస్తున్నామన్నారు. ప్రతి మున్సిపాలిటీలో వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలని అందులో అసోసియేషన్ నేతలను సభ్యులుగా చేయాలని కోరారు.

### నేరాల నియంత్రణపై అవగాహన

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** నగర పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న నేరాలపై పోలీసులు చేరువ వాహనం ద్వారా యువకులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ మేరకు బుధవారం సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏలూరు లాకులు, ఆల్ఫా హోటల్ సెంటర్‌తో పాటు వివిధ ప్రదేశాలలో చేరువ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. నేరాలు జరిగే కంటే అవి జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# పేదలకు ఉచితంగా ఖరీదైన వైద్యం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- 59వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్



మెడికల్ కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, నాయకులు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** పేదలు వైద్యం కోసం ఎక్కడా ఇబ్బందులు పడకుండా.. ఇంటి వద్దకే ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు. సింగ్‌నగర్ ఎంకే బేగ్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం బుధవారం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, స్థానిక కార్పొరేటర్ ఎండీ షాహినా సుల్తానాతో కలిసి ముందుగా ఆయన క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పౌరుడు ఆరోగ్యంగా ఉండాలని, వారి ఆరోగ్య అవసరాలు తీర్చడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జగనన్న ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇంటి వద్దే ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి వారికి ఐదు దశల్లో ఉచితంగా ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. 59వ డివిజన్లోని 235, 253, 254 వార్డు సచివాలయాల పరిధిలో 3,635 కుటుంబాలను సందర్శించిన వైద్య సిబ్బంది 4,513 రకాల పరీక్షలు నిర్వహించడం ద్వారా 1,339 టోకెన్లు అందజేశారని తెలిపారు. సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ప్రతి 15 రోజులకోసారి మందులను ఉచితంగా అందజేయడంతో పాటు మెరుగైన వైద్యం అవసరమైన వారికి పెద్ద హాస్పటల్స్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో గడిచిన నాలుగేళ్లలో 160 కోట్ల రూపాయల విలువైన వైద్య సేవలు అందించామని, శస్త్ర చికిత్స అనంతరం ఆరోగ్య ఆసరా కింద రోగులకు ఆర్థిక సహకారం ఇచ్చి అండగా నిలుస్తున్నామన్నారు.

**జగనన్న ఆరోగ్య సురక్ష మరో చారిత్రాత్మక కార్యక్రమం**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తలపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష 'కార్యక్రమం మరో చారిత్రాత్మకమైన అంశమని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అభివర్ణించారు. నిరుపేద ప్రజల ఆరోగ్యం కోసం ఇంతలా ఆలోచన చేసిన ముఖ్యమంత్రి కానీ, ప్రభుత్వం కానీ దేశంలో మరెక్కడా లేదని అన్నారు. అనంతరం రోగులకు మందులతో కూడిన మెడికల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజన, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు ఎండీ హఫీజుల్లా, కంభగళ్ల రాజు, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, గల్లెపోగు రాజు, చింతా శ్రీను, షేక్ వెంకట్, కోలా శాంతకుమారి, కొండా జయలక్ష్మి, పిల్లి లక్ష్మి, డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఇళ్ల వద్దే వైద్య పరీక్షలు**

**పాయకాపురం(విజయవాడరూరల్):** జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం వాంబే కాలనీ హెచ్‌బ్లాక్ 3లో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. బీపీ, సుగర్, జ్వరాలకు సంబంధించిన ఆరోగ్య పరీక్షలు చేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. రెండు బృందాలుగా ఏర్పడి హెచ్‌బ్లాక్ 3లో వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందచేశారు. ఈ నెల 26వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎమ్‌లు కుమారి, మల్లేశ్వరి, 262 సచివాలయ కన్వీనర్ ఆర్ఎస్ నాయుడు పాల్గొన్నారు.



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



ఎమ్మెల్సీ రుహుల్లాకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

## సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.7 లక్షలు మంజూరు

**పటమట(విజయవాడతూర్పు):** రాష్ట్రంలో అందరి సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారని, ఆరోగ్య సమస్యలపై వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా ఆయన చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఆయన నగరంలోని గుణదల ప్రాంతంలో నివసించే ఆటోడ్రైవర్ ప్రసన్న కుమార్, సుమతి దంపతుల పెద్ద కుమారుడు నమన్ ఈ నెల 4వ తేదీన ఆడుకొంటూ పడిపోవడంతో వెంటనే నగరంలోని రెయిన్‌బో ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటిలేటర్ మీద చికిత్స అందిస్తున్నారనే విషయం తెలిసిన వెంటనే అవినాష్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా బాలుడికి ఆరోగ్య పరిస్థితిపై రెయిన్‌బో ఆస్పత్రి వైద్యుల నుంచి సమాచారం తీసుకున్నారు. శస్త్రచికిత్స రూ.15 లక్షలు అవుతుందని అంతఖర్చు తాము భరించలేమని బాలుడి తల్లిదండ్రులు తెలపటంతో వెంటనే సీఎంవోకు సమాచారం ఇవ్వటంతో నాలుగు గంటల వ్యవధిలో సీఎం సహాయనిధి నుంచి బాలుడి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.7 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అనుమతి మంజూరు చేశారు. ఎల్‌వోసీను దేవినేని అవినాష్ ఆస్పత్రి యజమాన్యానికి అందించారు. ఈ సందర్భంగా ధైర్యంగా ఉండాలని బాలుడి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చి ఇక ముందు కూడా ప్రభుత్వం నుంచి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.



రెయిన్‌బో ఆస్పత్రి యాజమాన్యానికి ఎల్‌వోసీని అందజేస్తున్న దేవినేని అవినాష్

## 15 నుంచి దసరా, సంగీత మహోత్సవాలు

**విజయవాడకల్చరల్:** శ్రీ కంచికామకోటీ పీఠస్థ లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ నుంచి దసరా, సంగీత మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లబ్బీపేట శ్రీ శారదా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ చైర్మన్ మాగంటి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరిస్తామన్నారు. సాయంత్రం కళా వేదిక మీద తొమ్మిది రోజుల పాటు సంగీత, నృత్య కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

## దసరా ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దసరా ఉత్సవాల నేపథ్యంలో దుర్గగుడి మీదుగా వచ్చే ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్లు ఈవో కెఎస్.రామారావు పేర్కొన్నారు. మోడల్ గెస్ట్ హౌస్ నుంచి టోల్ గేట్ వరకు క్యూలైన్ల నిర్మాణం జరుగుతున్న క్రమంలో చర్యలు తీసుకున్నామన్నారు. భవానీపురం వైపు నుంచి వచ్చే వాహనాలను, బస్టాండ్, మార్కెట్ నుంచి కుమ్మరి పాలెం వైపు వెళ్లే వాహనాలను దుర్గగుడి ఫ్లై ఓవర్‌తో పాటు సితార, సోరంగం, చిట్టినగర్ మీదుగా మళ్లించామన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే వాహనాలను కుమ్మరిపాలెం మీదుగా అనుమతించరని చెప్పారు. గట్టువెనుక ప్రాంతానికి చెందిన వారితో పాటు వన్‌టౌన్ వా సులు ఈ విషయాన్ని గ్రహించి పోలీసు, దేవస్థానం అధికారులతో సహకరించాలని కోరారు.

## మానవ సేవే మాధవ సేవ

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** మానవ సేవే మాధవ సేవని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకుని అవసరమైన వారికి సేవ చేయాలన్నారు. బుధవారం జింఖానా మైదానంలో దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు యూనిఫాం, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దహించు అగ్ని మినిస్ట్రీస్ సేవలను కొనియాడారు. మినిస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ థామస్ తల్లి మరియ సెల్వమ్ జ్ఞాపకార్థం ఆటో డ్రైవర్లకు యూనిఫాం పంపిణీ చేసి సేవా గుణాన్ని చాటుకున్నారన్నారు. అనంతరం థామస్ అందించిన సేవలకు గాను ఆయనను నెల్సన్ మండేలా నోబుల్ పీస్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ చైర్మన్ కాకు మాను రాజశేఖర్, ఏపీ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ టి.శేఖర్, జాన్ వెస్లీ, బాలస్వామి, ఏఐసీసీ ప్రెసిడెంట్ జాన్ బెన్నీ లింగం తదితరులు పాల్గొన్నారు.



ఆటోడ్రైవర్లకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, రాజశేఖర్ తదతరులు

## రవాణా వాహనాలను నగరంలోకి అనుమతించాలి



పోలీస్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు

**సత్యనారాయణపురం (విజయవాడసెంట్రల్):** దసరా మహోత్సవాల సందర్భంగా రవాణా వాహనాలపై విధించిన ఆంక్షలను సడలించాలని కోరుతూ ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నేతలు బుధవారం పోలీస్ కమిషనర్ టీకే రాణాను కలిసి విజ్ఞప్తి చేశారు. రవాణా వాహనాలు ఇన్నర్ రింగ్ రోడ్డు, వైవీ రావు ఎస్టేట్, చనుమోలు వెంకట్రావు ఫ్లై ఓవర్, ఐరన్ యార్డు మీదుగా గొల్లపూడి నుంచి గూడ్స్ వాహనాలు బయటకు వెళ్లడానికి అనుమతించాలని కోరారు. వివిధ నగరాల నుంచి గూడ్స్ వాహనాలు రాత్రి వేళల్లో నగరంలోకి ప్రవేశించి లోడింగ్, అన్ లోడింగ్, మరమ్మతులు ముగించుకున్న తరువాత పగటి వేళ నగరం బయటకు వెళ్లడానికి అనుమతి లేనందున తిరిగి రాత్రిసమయం వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకుంటుందన్నారు. దీంతో రవాణా వాహన యజమానులకు తీవ్ర అసౌకర్యంతో పాటు ఆర్థికనష్టం కలుగుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు. సీపీని కలసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు తమ్మల లక్ష్మణస్వామి, ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి వీరవెంకయ్య, కార్యదర్శులు ఆళ్ల వెంకటేశ్వరరావు, వత్సవాయి కృష్ణంరాజు, సూరపనేని సురేష్, కొల్లి మురళీకృష్ణప్రసాద్, యార్లగడ్డ సుందరరావు తదితరులు ఉన్నారు.

## 15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** గద్దే వెంకట్రామయ్యనగర్ దేవుని మండపంలో ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు భక్తబృందం సభ్యుడు గద్దే శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక గద్దే వెంకట్రామయ్యనగర్ దేవుని మండపం వద్ద బుధవారం ఉత్సవాల కరపత్రాలను గద్దే వెంకట్రామయ్యనగర్ భక్త బృందం సభ్యులు నూతక్కి శ్రీను, శంకర్ ఆవిష్కరించారు.

**దుర్గాపురంలో..**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** దుర్గాపురం 4వ వీధిలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవాలయం పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీమురళీకృష్ణ ఆధ్వర్యాన ఈనెల 15వ తేదీ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బచ్చు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఆదివారం ఉదయం గణపతిపూజ, మండపారాధనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

**శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో..**

మధురానగర్ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబంధీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ రోజు అమ్మవారికి విశేషంగా అలంకారం చేయటంతో పాటు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చ, చండీ హోమం జరుగుతాయన్నారు.

## బ్రహ్మోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు

**15 నుంచి 11 రోజుల పాటు నిర్వహణ**

**విజయవాడకల్చరల్:** లబ్బీపేట శ్రీశారదా చంద్రమౌళీశ్వరులు, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శ్రీ కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో శోభకృతు నామ సంవత్సర వార్షిక బ్రహోత్సవాలు నిర్వహించనున్నారు. 15వ తేదీ శనివారం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ, అజసహస్రదేవతా రాధన, విశ్వక్షేన పూజ నిర్వహిస్తారు. 16న నవకుంభసాధన, 17న నిత్యహోమం, బలిహరణ, 18న కుంభమంత్రణం, 19న నిత్యహోమం, 20న శ్రీవారి కల్యాణోత్సవం, 21న మహా హోమం, 22న సప్తరుషి పూజ, 23న గరుడోత్సవం అష్ట కలశ స్థాపన, 24న డోలోత్సవం, 25న పవళింపు సేవ, వసంతోత్సవం జరుగుతాయి. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పూజాది కార్యక్రమాలు కొనసాగుతాయి.



శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

## సబ్సిడీ రుణాల ద్వారా టిప్పర్ల అందజేత



టిప్పర్లతో బ్యాంక్ అధికారులు, వాహనదారులు

**గుణదల(విజయవాడ తూర్పు):** పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా చేయూతనిచ్చే దిశగా జాతీయ బ్యాంకులు కృషి చేస్తున్నాయని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎస్ఎస్ మూర్తి అన్నారు. శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని సెంట్రల్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో టిప్పర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. దీనిలో భాగంగా జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా తమ బ్యాంక్ సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేస్తుందని చెప్పారు. దీని ద్వారా సామాన్యులు ఆర్థికంగా ఎదిగే అవకాశం లభిస్తుందన్నారు. ఎటువంటి భారం లేకుండా రుణాలు చెల్లించగలుగుతారని చెప్పారు. అనంతరం మూడు టిప్పర్లను అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ప్రసన్న, చీఫ్ మేనేజర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికలను మరింతగా ప్రోత్సహించాలి

**కలెక్టర్ ఢిల్లీరావు**



అవగాహన వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బాలికలే భవిష్యత్‌గా గుర్తించి, వారిని మరింతగా ప్రోత్సహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. అన్ని రంగాల్లో బాలికలు ముందుండేలా కృషి చేయాలని చెప్పారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మేరీ స్టెల్లా కళాశాల, చైల్డ్ లైన్ 1098, పోలీస్, ఐసీడీఎస్, బాలల హక్కుల పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ముద్రించిన బాలికలే భవిష్యత్ అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ ఢిల్లీరావు విడుదల చేశారు.

**ఆడపిల్లలే కావాలన్న పరిస్థితి..**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారన్నారు. ఈ తరుణంలో మహిళల ప్రాధాన్యత పెరిగిందన్నారు. బాలికల ఒక నాటి చులకన భావన నేడు లేదని చెప్పారు. తల్లిదండ్రులు తమకు ఆడపిల్లలే కావాలన్న పరిస్థితులను నేడు చూస్తున్నామన్నారు. ప్రభుత్వం బాలికల సంరక్షణకు అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. బాలికలు ఆపదలో ఉన్నట్లు గురిస్తే చైల్డ్ లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181, పోలీస్ 100, 112 ఉచిత ఫోన్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి, డ్వామా పీడీ జె. సునీత, ఫోరంఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవ రమేష్, మేరీ స్టెల్లా కళాశాల సోషల్ వర్క్ సిస్టర్ సహాయమేరి, బర్డ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్‌కుమార్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**బాలికలు దేశానికే గర్వకారణం**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** బాలికలు దేశానికే గర్వకారణమని, వారిని ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో ముందు ఉంటారని శ్రీ భారతీయ విద్యామందిర్ పాఠశాల ఇన్‌చార్జి దాట్ల భాస్కరరాజు అన్నారు. స్థానిక ముత్యాలంపాడు భారతీ విద్యామందిర్‌లో బుధవారం బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు వార్డు సచివాలయం సిబ్బంది ప్లకార్డులు చేతబూని భానునగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, నాగదుర్గాభవాని, అంగన్‌వాడీ కార్యకర్త సరిత తదితరులు పాల్గొన్నారు.

**బాల బాలికలు ఇద్దరూ సమానమే**

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** బాల బాలికలు ఇద్దరూ సమానమే అన్న భావన తొలుత ఇంటి నుంచే ప్రారంభం కావాలని నవజీవన్ బాలభవన్ ప్రోగ్రామ మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు అన్నారు. బుధవారం బిషప్ అజరయ్య హైస్కూల్‌లో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు కె.సుసన్నా, సీహెచ్ రమ్య జ్యోతి, ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. లింగ-ఆధారిత వివక్ష, బాలికలపై హింసలేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా ఉండాలని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మెచ్ఎం జయ శ్రీ, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్‌కే నజ్మా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిట్టచివరి గడపకు సంక్షేమం, అభివృద్ధి పథకాలు

**గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే విష్ణు**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** చిట్టచివరి గడప వరకు సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 26వ డివిజన్ 30వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇన్‌చార్జి అంగిరేకుల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమవుతూ అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను తెలుసున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ ఇక్బాల్ బాషా మాట్లాడుతూ.. ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన 4 శాతం రిజర్వేషన్ తమ పిల్లల ఉన్నత చదువులు, ఉద్యోగాలకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. ఆ మహానేతకు తమ కుటుంబం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందన్నారు.



పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే విష్ణు

**మైనార్టీల అభ్యున్నతికి కృషి ...**

టీడీపీ గత ఐదేళ్ల పాలనలో మైనార్టీ సంక్షేమం కోసం ఖర్చు చేసింది కేవలం రూ.2,665 కోట్లు మాత్రమేనని.. ఈ ప్రభుత్వం నాలుగేళ్లలో రూ. 60,54,839 మందికి మైనార్టీలకు వివిధ పథకాల ద్వారా రూ.20 వేల కోట్లకు పైగా లబ్ధి చేకూర్చిందని ఎమ్మెల్యే విష్ణు తెలిపారు. సీఎం అమలు చేస్తున్న కార్యక్రమాలను కాపీ కొట్టడమే పనిగా ప్రతిపక్షాలు పెట్టుకున్నాయని ఆరోపించారు. మున్సిపల్ అధికారులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

## మహానటి సావిత్రి నటజీవితం ఆదర్శనీయం

**విజయవాడకల్చరల్:** మహానటి సావిత్రి నటజీవితం భావి నటీమణులకు ఆదర్శనీయమని విశ్వమాతా చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక సేవ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం మహానటి సావిత్రి సేవా పురస్కారం, దసరా మహోత్సవాల ప్రారంభ కార్యక్రమంగా సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ సావిత్రి బహుముఖ ప్రతిభాశాలి అని అభివర్ణించారు. సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇండో పాక్ యుద్ధ సమయంలో ఆమె దేశ రక్షణ నిధికి భారీగా విరాళం ఇచ్చారని తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామ కృష్ణమూర్తి పురస్కార గ్రహీత మహంతి వాసుదేవరావు నిర్వహిస్తున్న సేవలను వివరించారు. అప్పల నరసయ్య, మహాలక్ష్మి చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు మహంతి వాసుదేవరావుకు 2023 సంవత్సరానికి గానూ మహానటి సావిత్రి సేవా తపస్వి పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో సాహితీ సంస్థల ప్రతినిధులు కొప్పుల ఆనంద్, ఉమాబలరాం, కొత్త జ్యోతి, చింతకాయల చిట్టిబాబు, చావా నరసింహారావు, బీవీ వీరభద్రరావు, రమణ పాల్గొన్నారు. గాయనీ గాయకులు సుధారాణి, రసూల్‌బాబు, విష్ణుప్రియ తదితరులు వాణిశ్రీ, సావిత్రి నటించిన చిత్రగీతాలను ఆలపించారు.